క్లుప్తంగా

అందుబాటులో బూస్టర్ డోస్

మీర్‌పేట: కోవిడ్-19కు బూస్టర్ డోస్ టీకా బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉందని వైద్య సిబ్బంది మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోవిషీల్డ్, కోవ్యాక్సిన్ మొదటి, రెండవ డోస్ తీసుకున్న వాళ్లకు బూస్టర్ (మూడవ డోస్)ను ఆసుపత్రిలో వేయనున్నట్లు తెలిపారు. మండలంలో రెండో డోస్ వేసుకున్న వారు ఆసుపత్రిలో బూస్టర్ డోస్ వేసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు.

మొగులయ్యకు ఘన సన్మానం



మొగులయ్యను సన్మానిస్తున్న సీఐ

కందుకూరు: పద్మశ్రీ అవార్డు గ్రహీత, కిన్నెర వాయిద్యకారుడు మొగులయ్యను కందుకూరు పీఎస్‌లో సీఐ కృష్ణంరాజు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు శ్రావణ్‌కుమార్, కొండల్, నాగరాజు, సిబ్బందితో పాటు ఎమ్మార్పీఎస్ నాయకుడు కంద పెద్ద నర్సింహ, జైత్వారం మాజీ సర్పంచ్ పర్వతాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజికల్ డైరెక్టర్‌కు సన్మానం



హేమంత్‌ను సన్మానిస్తున్న ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు

కందుకూరు: మండలంలోని లేమూరుకు చెందిన 20 మంది ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ ఇచ్చిన బీసీ గురుకుల పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ హేమంత్‌ను మంగళవారం పలువురు అభ్యర్థులు సన్మానించి సత్కరించారు. మొత్తం 20 మంది శిక్షణ తీసుకోగా అందులో 17 మంది ఉత్తీర్ణులయ్యారు. దీంతో బైరాగిగూడలో ఆయన్ను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగభూషణాచారి, నాయకులు గుల్విు జైపాల్, గుల్విు జంగయ్య, ఉపాధ్యాయులు, ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన వైద్యులు

మాడ్గుల: మండలంలోనిఇర్విన్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యుడిగా డా.ఆర్.రఘురాం నాయక్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ వైద్యుడిగా విధులు నిర్వహించిన డా.శ్రీనివాస్ ఉన్నత చదువుల కోసం వెళ్లగా దేవరకొండలో విధులు నిర్వహిస్తున్న డా.రఘురాం నాయక్ బదిలీపై ఇర్విన్‌కు వచ్చారు.

ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రిలో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం ఇద్దరు డాక్టర్లు విధుల్లో చేరారు. ఇంతవరకు ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారిగా పనిచేసిన డా.అర్షద్ మేడ్చల్ జిల్లాలోని షామీర్‌పేట ప్రభుత్వాస్పత్రికి బదిలీ అయ్యారు. కాగా ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రికి డా.మంజుల, డా.మైమునబేగం నూతనంగా నియామకం కాగా మంగళవారం విధుల్లో చేరారు.

ఉన్నత శిఖరాలు చేరుకోవాలి



విద్యార్థులకు పరీక్షప్యాడ్లు అందజేసిన నాయకులు

కడ్తాల్: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోల రాఘవేందర్ అన్నారు. మండల కేంద్రంలో యువజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక కేజీబీవీ విద్యార్థులకు పరీక్షప్యాడ్స్, పెన్నులు అందజేశారు. ప్రతిఒక్కరూ సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ రామకృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, వివేకానంద యూత్ అధ్యక్షులు మాధవులు పాల్గొన్నారు.

భవన మరమ్మతులకు నిధుల మంజూరు

ఆమనగల్లు: ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండల కేంద్రాల్లోని ఎమ్మార్సీ భవనాల మరమ్మతులకు రూ.10 లక్షలు మంజూరు అయినట్లు ఆమనగల్లు ఎంఈఓ సర్దార్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో భవనానికి రూ.2.5 లక్షల చొప్పున మంజూరు చేయడానికి కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అంగీకరించారని ఆయన చెప్పారు.

కాలుష్య కోరల్లో అన్నోజిగూడ

- వాయు కాలుష్యంతో దెబ్బతింటున్న పంటలు
- శ్వాసకోస ఇబ్బందుల్లో జనం, రైతులు
- పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల వినతి



కాలుష్యం వల్ల ఎండిన చెట్లు (ఇన్‌సెట్‌లో) పరిశ్రమ నుంచి వెలువడుతున్న వాయు కాలుష్యం

కందుకూరు: కాలుష్యకారక పరిశ్రమలతో అన్నోజిగూడ ప్రాంత రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిశ్రమల నుంచి వెలువడే వాయు కాలుష్యం వల్ల పంటలు దెబ్బతింటున్నాయి. ఆ పొగను పీల్చడం వల్ల ప్రజలు శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నారు. గ్రామస్తులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కందుకూరు మండలం అన్నోజిగూడ సమీపంలోని బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమ వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ కంపెనీ నుంచి నిత్యం వాయు కాలుష్యం విడుదలవుతున్నట్లు ప్రజలు తెలిపారు. పొగ, దుర్వాసన వల్ల ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. చుట్టుపక్కల పొలాల్లో పంటలు మసిబారి దెబ్బతింటున్నాయని రైతులు తెలిపారు. అంతేకాకుండా సమీపంలోని చెరువు నీరు కలుషితమై చేపలు పెంపకానికి ఆటంకం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు నీరు తాగి పశువులు రోగాల బారిన పడుతున్నాయి. ఒంటిపై వేసుకున్న దుస్తులు సైతం నల్లబారుతున్నాయని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. రాత్రి వేళ దుర్వాసన మరీ ఎక్కువగా ఉన్నట్లు ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాలుష్య కారక పరిశ్రమలను మరో చోటికి తరలించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

దిగుబడి తగ్గింది



బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమ సమీపంలో మాకు ఆరు ఎకరాల భూమి ఉంది. అందులో వరి సాగు చేస్తాం. గతంలో ఎకరాకు 35 బ్యాగులు దిగుబడి వచ్చేది. కంపెనీ నుంచి వెలువడే వాయు కాలుష్యంతో పంటలు దెబ్బతిని దిగుబడి బాగా తగ్గింది. చెరువులో చేపలు కూడా చనిపోతున్నాయి.

– ప్రవీణ్, రైతు, అన్నోజిగూడ

నష్టాలే మిగులుతున్నాయి



నాకు కంపెనీ సమీపంలో రెండు ఎకరాల భూమి ఉంది. అందులో వరి సాగు చేశా. పరిశ్రమ నుంచి వెలువడే నల్లని మసి పంటలపై చేరుతోంది. దీంతో దిగుబడి తగ్గి నష్టాలు వస్తున్నాయి. అధికారులు స్పందించి పరిశ్రమను మరో చోటికి తరలించేలా చొరవ తీసుకోవాలి.

– పరమేష్, రైతు, అన్నోజిగూడ

పరిశ్రమతో ప్రజలకు ఇబ్బంది



బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమతో గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కంపెనీపై చర్యలకు గ్రామ సభలో తీర్మానం చేసి అధికారులకు పంపాం. వాయు కాలుష్యం వల్ల చెరువు పాడవుతోంది. ఆ నీటిని తాగిన పశువులు, జీవాలు వ్యాధుల బారిన పడుతున్నాయి. దీంతో పాడిరైతులు నష్టపోతున్నారు. ఈ సమస్యను మరోసారి మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిశ్రమను మరో చోటికి తరలించేలా కృషి చేస్తాం.

– ఇందిర, సర్పంచ్, అన్నోజిగూడ

వెంకన్నకు గరుడ వాహన సేవ



గరుడ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

పహాడీషరీఫ్: మామిడిపల్లి బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణం సోమవారం రాత్రి గోవింద నామస్మరణతో మారుమోగింది. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని రాత్రి 7గంటలకు ఆలయ ప్రాంగణంలో గరుడ వాహన సేవ నిర్వహించారు. స్వామివారు గరుడ వాహనంపై సేద తీరి పురవిహారం చేశారు. వాహన సేవలో మహిళలు పోటీ పడ్డారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బండారి గోపాల్ యాదవ్, 12వ డివిజన్ కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్ యాదవ్, దాతలు దామోదర్ సచిన్ సోని, ఎడ్ల వాసుదేవారెడ్డి, రవి ప్రసాద్, ,గ్రామస్థులు నందీశ్వర్, గణేష్ గౌడ్ , సురేష్ గౌడ్, సుదర్శన్ తదితరులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

పాఠశాలకు ఫ్యాన్లు, లైట్లు వితరణ



పాఠశాల సిబ్బందికి ఫ్యాన్లు, లైట్లు అందజేస్తున్న నాయకులు

కందుకూరు: మండలంలోని రాచులూరు జిల్లా పరిషత్ పాఠశాలకు మంగళవారం బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గుయ్యని సామయ్య, వార్డు సభ్యురాలు గుయ్యని జయమ్మ రూ. 10 వేల విలువ చేసే 6 సీలింగ్ ఫ్యాన్లు, పది ట్యూబ్ లైట్లను జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, చైర్మన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌చారి, నాయకులు బర్కం వెంకటేష్, దేశం కృష్ణారెడ్డి, కె.విఘ్నేశ్వర్‌రెడ్డి, గుయ్యని శశికుమార్, ప్రధానోపాధ్యాయుడు డి.వేణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

జెడ్పీటీసీ జంగారెడ్డి



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ జంగారెడ్డి తదితరులు

కందుకూరు: మంత్రి సబితారెడ్డి సహకారంతో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తగూడ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలల వరకు సీతారామశాస్త్రి నగర్ మీదుగా చేపట్టిన మట్టి రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ సాధ మల్లారెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. మొదట మట్టి రోడ్డు నిర్మించిన తరువాత సీసీ రోడ్డు వేస్తామని తెలిపారు. దీంతో కాలనీ వాసులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సామ ప్రకాష్‌రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, మాధవరెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

నాలా పనులను పూర్తి చేయండి

భిక్షాటన చేసి నిరసన తెలిపిన బీజేపీ



భిక్షాటన చేస్తున్న బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: నిధులు లేక అర్ధాంతరంగా ఆగిన ఎస్ఎన్‌డీపీ నాలా పనులు వెంటనే మొదలు పెట్టాలని మంగళవారం బీజేపీ నాయకులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. బీజేవైఎం బడంగ్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది 1, 22, 23, 29వ డివిజన్‌లో వరద నీటి ముంపు నుంచి విముక్తి కల్పించేందుకు ట్రంక్ లైన్ (ఎస్ఎన్‌డీపీ) పనులు మొదలు పెట్టి మధ్యలోనే నిలిపివేశారని తెలిపారు. పనులు ఆగి ఏడాది కావస్తున్నా ప్రారంభించడం లేదని మండిపడ్డారు. వెంటనే పనులు మొదలు పెట్టాలని, లేకుంటే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా కో కన్వీనర్ నడికుడ యాదగిరి, చంద్రపాల్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నిధులు దారి మళ్లిస్తున్నారు

ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధికి విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి సర్పంచ్‌లను మోసం చేస్తోందని ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో సర్పంచ్‌లు సేవ్యానాయక్, పోతుగంటి శంకర్, పాండునాయక్, రాములునాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల గ్రామ పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమవుతోందన్నారు. గ్రామాల అభివృద్ధి విషయంలో సీఎం ప్రకటనలకు, పోకడలకు పొంతన లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హమీ పథకం ద్వారా ఇస్తున్న నిధుల ద్వారానే గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, గ్రామాల్లో చేపట్టిన పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, రైతువేదికలు, డంపింగ్‌యార్డులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల ద్వారానే నిర్మించారని చెప్పారు. పంచాయతీ పాలకవర్గాలు చేపట్టిన పనులకు నెలల తరబడి బిల్లులు అందకపోవడంతో సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వంలో చలనం లేదని విమర్శించారు. గ్రామ పంచాయతీల నిధుల మళ్లింపుపై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేపడితే అడ్డుకోవడం దారుణం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన పంచాయతీల నిధులను తిరిగి గ్రామ పంచాయతీల ఖాతాల్లో వేసేవరకు కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌ల పక్షాన పోరాటం సాగిస్తుందన్నారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, రాంచందర్‌నాయక్, బీచ్యానాయక్, ఛత్రునాయక్ రాజేందర్ ఉన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి



బ్యాటింగ్ చేసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలో జీఎస్‌ఆర్ యువసేన ఆధ్వర్యంలో దివంగత వస్పుల ప్రకాశ్ స్మారక జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వస్పుల ప్రకాశ్ చిత్రపటానికి గోలి శ్రీనివాస్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అనురాధ, ఆమనగల్లు సీఐ ఉపేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ గిరియాదవ్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్, నాయకులు రాము, రాజు, రమేశ్, సుభాష్, కమటం వెంకటయ్య, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మణికొండ: మహిళలు డ్వాక్రా సంఘాల్లో చేరి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యాపారాలు, ఉత్పత్తుల తయారీ చేపట్టి ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఉందని మణికొండ మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానికంగా పేపర్ ప్లేట్‌ల తయారీ, ఫుడ్ కేటరింగ్, జూట్ బ్యాగ్‌ల తయారీ లాంటివి చేపడితే స్థానికంగానే వాటిని కొనుగోలు చేసే వారు అధికంగా ఉన్నారన్నారు. అలాంటి శిక్షణలకు మహిళలకు స్థానికంగానే అందించేందుకు కృషి చేస్తామన్నారు. మున్సిపాలిటీని స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తలు వేరు చేసేలా ప్రజలను ప్రోత్సహించేందుకు డ్వాక్రా మహిళలు తమ వంతు కృషి చేయాలన్నారు. కౌన్సిలర్‌లు శ్వేతార వికాంత్‌రెడ్డి, మీన ముత్యాలు, ఎల్. వందన నగేష్, కో-ఆప్షన్ సభ్యురాలు లక్ష్మీ, డ్వాక్రా సంఘాల ఆర్‌పీ రాజేశ్వరి, టీఎంసీ లక్ష్మీలతో పాటు మహిళలు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయం

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లింగం



హుడాకాంప్లెక్స్: సావిత్రిబాయిపూలే జయంతిలో పాల్గొన్న సరూర్‌నగర్ నాయకులు

మహేశ్వరం: సావిత్రిబాయి పూలే చేపట్టిన సంఘ సంస్కరణలు, బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలు చిరస్మరణీయమని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లింగం పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్, జగ్జీవన్ విగ్రహాల వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహేశ్వరం బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా విభాగాలు ఏర్పాటు చేసి వితంతువులు, కులాంతర వివాహాలు జరిపిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. 1890లో ప్లేగు వ్యాధి బారిన పడిన పిల్లల కోసం ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఎంతో మంది చిన్నారుల ప్రాణాలు కాపాడిందన్నారు. సావిత్రిబాయి పూలే జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నడ్డి నర్సింహ, ప్రధాన కార్యదర్శి గన్నోజు మహేష్ చారి, నాయకులు కట్టెల రాజశేఖర్, ఆకాష్, దయాకర్, శ్రీనివాస్, రవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను గుర్తు చేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రమణమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: సావిత్రిబాయి పూలే జయంతిని మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో మంగళవారం ముదిరాజ్ మహాసభ మండల యూత్ అధ్యక్షుడు కొర్వి సురేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళల విద్యాభివృద్ధికి, నిమ్న వర్గాల సంక్షేమానికి ఆమె చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఢిల్లీ వెంకటేష్ ముదిరాజ్, ఢిల్లీ శివకుమార్, ఎస్ పవన్, అఖిల్, ఆకాష్, అభిషేక్, శివ, హర్షిత, ఉదయ్, మణికంఠ పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

పహాడీషరీఫ్: మహిళా హక్కుల ఉద్యమ కెరటం సావిత్రిబాయి పూలే అని బీఎస్పీ జల్‌పల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు యంజాల వినోద్‌కుమార్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మంగళవారం జల్‌పల్లిలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యా విజ్ఞానం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను స్త్రీ జాతికి ప్రసాదించడానికి అలుపెరగని పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. 1852లో మహిళా మండలిని స్థాపించి, దాని ద్వారా కుల మత వివక్షతను పోగొట్టడానికి ఎంతో కృషి చేశారన్నారు. సామాజిక కార్యకర్త, రచయిత, మహిళా హక్కుల ఉద్యమ కారిణిగా సేవలందిందచారని కొనియాడారు. పెత్తందార్ల బెదిరింపులను సైతం లెక్కచేయకుండా పాఠశాలను స్థాపించి మహిళలకు విద్యాబోధన చేశారన్నారు. ప్రతి మహిళా ఆమె బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు బాలరాజు, అనిల్, అశోక్, యాదయ్య, అరవింద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలి

మీర్‌పేట: సావిత్రిబాయిపూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరారు. మంగళవారం జిల్లెలగూడలోని చల్లా లింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయిని అయిన సావిత్రిబాయి పూలే జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అదే విధంగా ఆమె జయంతిని రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించి అధికారికంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సరళ, ఉపాధ్యాయులు పి.నాగమణి, మానస, అపర్ణ, రాజేశ్వరి, శ్రీదేవి, స్వర్ణలత, శ్రీవిద్య, మాధవి, ప్రసన్నకుమారి, జి.శంకరయ్య, రాంచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, ఆంజనేయులు, జానీపాషా, మురళీకాంత్, రాజేందర్, వరలక్ష్మి, సరిత, అరుణ, దీపిక పాల్గొన్నారు.

సరూర్‌నగర్‌లో..

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లో మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతిని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్య సమితి అధ్యక్షులు, నాయకులు ఆకుల అరవింద్‌కుమార్, బబ్బూరి ఆనంద్, యాంద్ర లోకేష్, కల్పన, కబీర్దాస్, రవీందర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, మొగిళ్ల మల్లేష్ పాల్గొన్నారు.



కందుకూరులో నివాళులర్పిస్తున్న ముదిరాజ్ నాయకులు



మీర్‌పేట: జిల్లెలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



పహాడీషరీఫ్: నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

కారు బీభత్సం.. కేసు నమోదు

శంషాబాద్: అర్ధరాత్రి ఓ వైద్య విద్యార్థి కారుతో బీభత్సం సృష్టించాడు. రోడ్డుపై వెళ్తున్న వాహనాలను ఢీ కొట్టడంతో పాటు వారితో దురుసుగా ప్రవర్తించాడు. ఈ ఘటనలో ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధి ఎయిర్‌పోర్టు రోడ్డులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రాత్రి 1.20 గంటల సమయంలో ఎయిర్‌పోర్టు రెండో రోటరీ వద్ద బంజారాహిల్స్‌కు చెందిన వైద్య విద్యార్థి గౌతమ్ మొహతి(25) అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ముందుగా వెళ్తున్న ఆటోను వెనక నుంచి ఢీ కొట్టాడు. దీంతో ఆటో డ్రైవింగ్ తాజుద్దీన్ తలకు తీవ్ర గాయమైంది. కాగా మరికొద్ది సేపటికే ఎయిర్‌పోర్టు వైపు వెళ్తున్న మరో కారును ఢీ కొట్టగా.. కారు వెనక భాగంతో పాటు ఎడమవైపు కూడా ధ్వంసమైంది. వీరితో పాటు ఓ ద్విచక్రవాహనదారుడిని ఢీ కొట్టాడు. బాధితుల ఫిర్యాదుతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు చేపట్టగా.. మద్యం తాగినట్లు తేలలేదు. దీంతో అతడు మరేవైనా మత్తుపదార్థాలు సేవించాడా.. అనే అనుమానంతో పోలీసులు రక్తనమునాలను తీసుకుని పరిశీలన కోసం ల్యాబ్‌కు పంపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భూపాల్‌నగర్‌లో ఫాగింగ్

రాజేంద్రనగర్: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరీశంకర్ సూచించారు. చెత్తచెదారాలతో పాటు మురుగు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. భూపాల్‌నగర్‌లో మంగళవారం ఫాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి స్థానికులకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో దోమలు వృద్ధి చెందుతాయని నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పరిసరాల్లో చెత్తచెదారాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఫాగింగ్ ద్వా రా దోమల నివారణ కొంత మేర తగ్గుతుందన్నారు.